క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్ ఆవరణలో రక్తదానం శిబిరం



రక్తదానం చేస్తున్న మెరైన్ సీఐ రమేష్ కుమార్

సోంపేట: రక్తదానం చేయడానికి యువత ముందుకు రావడం అభినందనీయమని కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌స్టేషన్ బారువ సీఐ డి.వి.జె.రమేష్ కుమార్ అన్నారు. బారువ మెరైన్ పోలీస్ స్టేషన్ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం స్టేషన్ ఆవరణలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మందస మండలానికి చెందిన తీరప్రాంత యువత, మెరైన్ పోలీస్ సిబ్బంది 65 మంది నుంచి 64.5 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో టెక్కలి ఆస్పత్రి వైద్యురాలు సునీత, ఎస్సైలు శ్రీనివాస్, శిరీష, బారువ, హరిపురం పభుత్వ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి నీటిబొట్టును పరిరక్షిద్దాం



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

టెక్కలి: ప్రతి నీటిబొట్టును పరిరక్షించి భవిష్యత్ తరాలకు నీటి కష్టాలు తీరాలని విద్యార్థులు నినదించారు. ప్రపంచ జల వనరుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా స్థానిక అమ్మఒడి పాఠశాలకు చెందిన విద్యార్థులు పట్టణంలో శనివారం ర్యాలీ చేశారు. నీటి వనరులను కాపాడుకోవాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సోంపేట: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సోంపేట కోర్టుల సముదాయం సీనియర్ సివిల్ న్యాయమూర్తి జె.శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. లైంగిక వేధింపులు, పిల్లల సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ, న్యాయవాది శైలేంద్ర, వెలుగు, అంగన్‌వాడీ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

బెంతొరియాల సమస్యలు పరిష్కరించాలి

కవిటి: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని బెంతొరియాల సామాజిక సంఘం జిల్లా అధ్యక్షుడు రజనీ కుమార్ దొళాయి కోరారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ కవిటి బస్టాండ్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 451వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. అనేక కారణాలతో తమ సామాజికవర్గానికి చెందిన విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. దీక్షలో పలువురు సభ్యులు కూర్చున్నారు.

శతశాతం పన్నులు వసూలు చేయాలి

కాశీబుగ్గ: పన్నులను శతశాతం వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. ఆస్తి పన్ను వసూలుపై రెవెన్యూ సిబ్బంది, అన్ని సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పన్ను వసూలులో అలసత్వం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మొండి బకాయిదారుల ఇళ్లకు కుళాయి, విద్యుత్ కనెక్షన్ల తొలగింపు, డోర్ టు డోర్ చెత్త సేకరణ నిలిపివేస్తామన్నారు.

నేడు మాకన్నపల్లెలో విప్లవ యోధుల సంస్మరణ సభ

కాశీబుగ్గ: బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా దేశ ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల కోసం పోరాడి ఉరి కంబాన్ని ముద్దాడిన విప్లవ యోధులు భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల 94వ సంస్మరణ సభను పలాస మండలం మాకన్నపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం పది గంటలకు నిర్వహిస్తున్నట్టు దేశ భక్తి ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) శ్రీకాకుళం జిల్లా నిర్వహక కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

నీటి సంరక్షణపై అవగాహన

ఇచ్ఛాపురం టౌన్: నీటిని వృథా చేయకుండా చూడాలని జేసీఐ సంస్థ సభ్యులు అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా జేసీఐ ఆధ్వర్యంలో నీటిపరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని ఇచ్ఛాపురం పట్టణంలో శనివారం నిర్వహించారు. గాలితో పాటు నీరు కూడా మనుషులతోపాటు జంతువులకు ఎంతో అవసరమన్నారు. సేవ్ వాటర్ సేవ్ లైఫ్ అనే సందేశాన్ని తెలియజేసే పోస్టర్లను నీరు వినియోగించే ప్రదేశాల్లో అతికించారు. జేసీఐ అధ్యక్షుడు కె.జయదేవ్, సభ్యులు స్వరూప్, పవన్, దినేష్, సంతోష్ పాల్గొన్నారు.

నీటి ప్రాధాన్యతను గుర్తించాలి

కంచిలి: ప్రకృతి పచ్చదనంగా మారాలన్నా.. గొంతు తడవాలన్నా.. ప్రాణం నిలవాలన్నా నీరే ఆధారమని గుర్తించాలని విద్యార్థులు అన్నారు. అంతర్జాతీయ జల దినోత్సవం సందర్భంగా బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు నీటి ప్రాధాన్యతను తెలియజేసేలా శనివారం నాటిక ద్వారా వివరించారు.

ప్రజారోగ్యం గాలికి!



నిరుపయోగంగా ఉన్న బొడ్డపాడులోని వెల్‌నెస్ సెంటర్

- వెల్ నెస్ సెంటర్లను పట్టించుకోని కూటమి సర్కార్
- నిరుపయోగంగా విలువైన భవనాలు

పలాస: ప్రజారోగ్యాన్ని కూటమి సర్కార్ గాలికి వదిలేసిందనే విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజల ప్రాథమిక ఆరోగ్యం కోసం గ్రామ సచివాలయాల పరిధిలో నిర్మించిన హెల్త్ వెల్ నెస్ సెంటర్లను కనీసం పట్టించుకోకుండా వదిలేయడాన్ని ఉదాహరణగా చెబుతున్నారు. ప్రస్తుతం వాటి కోసం పట్టించుకునే నాథుడే లేడు. పలాస మండలంలో 19 పంచాయతీలు ఉండగా అందులో 16 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం నిధులతో వెల్ నెస్ సెంటర్లను నిర్మించారు. వీటి కోసం లక్షలాది రూపాయలను ఖర్చు చేశారు. కొన్నిచోట్ల ప్రారంభించారు. ఆయా కేంద్రాల్లో తగిన సిబ్బందిని కూడా నియమించారు. అయితే తొమ్మిది నెలల క్రితం రాష్ట్రంలో ప్రభుత్వం మారడం.. అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ వీటిని పట్టించుకోకపోవడంతో అవన్నీ ఇప్పుడు నిరుపయోగంగా ఉన్నాయి. అందులో విధులు నిర్వహించే ఎంఎల్‌పీహెచ్, ఏఎన్ఎం, ఆశ వర్కర్లకు సరైన పని లేకుండా పోయింది. తూతూ మంత్రంగా అప్పుడు గ్రామాల్లోకి వెళ్తున్నారు. లేదంటే ప్రత్యేకంగా ప్రభుత్వం కార్యక్రమాలు ఇచ్చినప్పుడు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. పలాస మండలంలో గురుదాసుపురం, చినంచల, కేదారిపురం, మాకన్నపల్లి, బొడ్డపాడు తదితర గ్రామాల్లో కొత్తగా నిర్మించిన భవనాలకు నీరు, విద్యుత్ సదుపాయాలు కూడా లేకపోవడంతో వైద్య ఆరోగ్య సిబ్బంది వాటిలో విధులు నిర్వహించడం లేదు. ఉద్దానం ప్రాంతంలో ఎక్కువ మంది కిడ్నీ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుంగా చిన్న చిన్న జబ్బులు వచ్చినా కాశీబుగ్గ పట్టణానికి వెళ్లాల్సి వస్తుంది. ఎక్కువ మంది సుగర్, బీపీ తదితర పరీక్షలు చేసుకోవడానికి కూడా ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ స్థాయిలో వెల్‌నెస్ కేంద్రాలు ఉంటే ఎంతో ఉపయోగంగా ఉండేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వాటిపై దృష్టి సారించి వెల్‌నెస్ సెంటర్లలో తగిన వసతులు కల్పించి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

మంచినీటి సదుపాయం కల్పించాలి

వెల్‌నెస్ కేంద్రం భవన నిర్మాణం పూర్తయింది. దీన్ని ప్రారంభించారు. అయితే మంచినీటి సదుపాయం, విద్యుత్ సౌకర్యం లేదు. ఊరుకి దూరంగా ఉంది. రాత్రివేళల్లో చాలా ఇబ్బందులు కలుగుతున్నాయి. అందుకే గ్రామంలో ఇల్లు అద్దెకు తీసుకొని అందులో ఉంటున్నాను.

– ఎస్.పావని, ఎంఎల్‌హెచ్‌పీ, బొడ్డపాడు, పలాస మండలం

ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ లేదు



కూటమి ప్రభుత్వానికి ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధలేదు. గత ప్రభుత్వంలో నిర్మించిన ఈ భవనాలను వినియోగంలోకి తేవడానికి తగిన చర్యలు తీసుకోవడం లేదు. ప్రజలకు ఉపయోగంగా ఉండే వెల్‌నెస్ కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకొచ్చి మెరుగైన వైద్య సేవలు అందించాలి.

– దువ్వాడ రవి, అల్లుకోల, పలాస మండలం

ఎల్లమ్మ జాతరకు మున్సిపల్ నిధులా?

- మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ల ధ్వజం



అభ్యంతరం వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

కాశీబుగ్గ: పలాసలో ఇటీవల జరిగిన జామి ఎల్లమ్మ జాతరకు మున్సిపాలిటీ నిధులు ఖర్చు చేయాల్సిన ఆవశ్యకత ఏమొచ్చిందని కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. చైర్మన్ బి.గిరిబాబు అధ్యక్షతన మున్సిపల్ సాధారణ, బడ్జెట్ సమావేశాలు శనివారం నిర్వహించారు. ఎల్లమ్మ జాతరకు రూ. 2.69 లక్షలు ఖర్చు చేసినట్లు అజెండాలో పొందుపరచడంపై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు శంకర్‌పండా, పప్పల ప్రసాద్, గుజ్జు జోగారావు, పిచ్చుక అజయ్ ప్రశ్నించారు. గతంలో జరిగిన జాతరలో రూ. 25 వేలకు మించి ఖర్చయ్యేది కాదని, ఈ ఏడాది మాత్రం రూ.2.69 లక్షలు వెచ్చించడాన్ని తప్పుబట్టారు. దీనిపై తమకు అనుమానాలు ఉన్నాయని ఈ అంశాలను ఆమోదించవద్దని డీసెంట్ ఇస్తున్నట్లు ప్రకటించారు. జాతరలో సొంత కమిటీలు నియమించుకొని దోపిడీ చేశారని, లక్షమందికి పైగా భక్తులు అమ్మవారికి దర్శించుకున్నారని, వారందరి వద్ద టిక్కెట్ రూపంలో వందేసి రూపాయలు దండుకున్నారని ఆరోపించారు. కనీసం చైర్మన్ గిరిబాబుకు సైతం మర్యాద ఇవ్వకుండా వ్యవహరించారని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో జరిగిన యాత్రను పాలకులు, అధికారులకు తెలియకుండా నిర్వహించడం తగదని.. అటువంటి పరిస్థితిల్లో కార్యక్రమానికి రూ. లక్షల నిధులు వినియోగించడం భావ్యం కాదన్నారు. మరో కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ మాట్లాడుతూ.. యాత్ర వ్యక్తిగత కార్యక్రమంగా మారిందన్నారు. పాలకవర్గం సభ్యులను సైతం ఆలయం చుట్టూ తిప్పించారని ఆరోపించారు. వచ్చే యాత్ర మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ గుజ్జు జోగారావు మాట్లాడుతూ.. కరోనా సమయంలో మహిళా పారిశుధ్య కార్మికులు మున్సిపాలిటీలో పనిచేసినా ఇంతవరకూ వారి వేతనాలు ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కమిషనర్ ఎన్.రామారావు సమాధానం ఇస్తూ వారికి వేతనాలు ఇప్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. వైస్ చైర్మన్ బోర కృష్ణారావు మాట్లాడుతూ.. తన వార్డులో తనకు తెలియకుండానే పవర్ బోర్ వేశారని, కనీసం అధికారులకైనా అది ఎక్కడుందో తెలుశా అని ప్రశ్నించారు. కో–ఆప్షన్ బమ్మిడి సంతోష్ మాట్లాడుతూ.. కాశీబుగ్గ వ్యవసాయ కార్యాలయం కొలతలు ఎందుకు తీశారో చెప్పాలని ప్రశ్నించారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించండి

వజ్రపుకొత్తూరు: అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఫౌండేషన్ లిటరసీ, న్యూమెరీస్ అసెస్‌మెంట్ పరీక్షలను వీఏఏలు పకడ్బందీగా నిర్వహిచాలని వెలుగు ఏపీఎం జి.ప్రసదరావు సూచించారు. శనివారం స్థానిక మండల మహిళాసమాఖ్య భవనంలో సీసీలు, వీవోఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈకేవైసీపై అవగాహన

వజ్రపుకొత్తూరు: రేషన్‌కార్డు కలిగి అందులో ఉన్న ప్రతీ సభ్యుడూ ఈకేవైసీ చేసుకోవాలని వజ్రపుకొత్తూరు సీఎస్‌డీటీ మురళీక్రిష్ణ సూచించారు. అమలపాడు, సైనూరు, గోవిందపురం, పీఎంపురం తదితర గ్రామాల్లో ఈకేవైసీపై శనివారం అవగాహన కల్పించారు. ఈ నెల 31 లోగా రేషన్ డీలర్ల వద్దకు వెళ్లి ఈకేవైసీ చేసుకోవాలని అవగాహన కల్పించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

కవిటి: షెడ్యూల్ కులాలకు చెందిన పేదల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సివిల్ రైట్స్ డే నిర్వహిస్తున్నామని తహసీల్దార్ బి.మురళీమోహనరావు అన్నారు. జగతి గ్రామంలోని ఎస్సీ వీధిలో సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని స్థానిక ఎస్సై వి.రవివర్మతో కలిసి శనివారం నిర్వహించారు. ఎస్సీ వీధికి సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని.. దీన్ని ప్రజలకు ఇబ్బంది లేకుండా సురక్షిత ప్రదేశానికి మార్పుచేయాలని, శ్మశానవాటికకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడి వరప్రసాదరావు ఉన్నారు.

బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దు

కంచిలి: బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చరాదని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కోరారు. శనివారం మండలంలోని నువాగడ తదితర గిరిజన గ్రామాల్లో వీరు పర్యటించి 25న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించబోయే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. గిరిజన సంఘం నేతలు స్థానిక సర్పంచ్ గొమాంగో సబితా, బుయ్యి రుషి, కింగర లక్ష్మణ్, దొలాయి పూర్ణచంద్ర ఉన్నారు.

జీవో 84 పూర్తిస్థాయిలో అమలు చేయాలి

ఇచ్ఛాపురం: ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధ్యాయుల బదిలీల చట్టంలో విడుదల చేసిన జీవో 84 పూర్తిస్థాయిలో అమలు చేయాలని మున్సిపల్ ఉపాధ్యాయులు కోరారు. శనివారం మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన పురపాలక ఉపాధ్యాయుల సమావేశంలో పలువురు మాట్లాడారు. బదిలీల చట్టంలో పురపాలక ఉపాధ్యాయులను చేర్చడం అనందంగా ఉందన్నారు. హెచ్ఎంలు పి.వి.రవణమ్మ, వై.లత పాల్గొన్నారు.

భవనాల పరిశీలన

సోంపేట: నిబంధనలకు విరుద్ధంగా సోంపేట మేజర్ పంచాయతీలో భవనాలను నిర్మించారని మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు సుడా అధికారులు శనివారం పరిశీలించారు. ఒక లేఅవుట్, ఆర్అండ్‌బీ స్థలంలో నిర్మించిన భవనాలు పరిశీలించారు. వీరికి నోటీసులు ఇవ్వనున్నట్టు వెల్లడించారు. సుడా బిల్డింగ్ మేనేజర్ పి.మోహన్, సైట్ ఇంజినీర్ కె.మోహన్, పంచాయతీ ఈవో శాంతికుమారి ఉన్నారు.

వ్యక్తి అరెస్టు

ఇచ్ఛాపురం: ఒడిశాకు చెందిన 25 సారా ప్యాకెట్లు కలిగి ఉన్న పట్టణానికి చెందిన శంభూశంకర్ రెడ్డిని అరెస్టు చేసినట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.దుర్గాప్రసాద్ శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి జాతీయరహదారిపై ప్రొహిబిషన్ సిబ్బంది నిర్వహించిన తనిఖీల్లో ద్విచక్ర వాహనంలో సారా ప్యాకెట్లను తీసుకొస్తుండగా శంభూశంకర్‌రెడ్డి పట్టుబడినట్టు చెప్పారు. దాడుల్లో ఎస్సై సీహెచ్‌వీ రమణ ఉన్నారు.

బెట్టింగ్ మాయలో పడొద్దు

- కాశీబుగ్గ డీఎస్పీ వెంకటఅప్పారావు



ర్యాలీలో పోలీసులు, విద్యార్థులు

కాశీబుగ్గ: బెట్టింగ్ మాయలో పడి ఆస్తులను కోల్పోవద్దని కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు అన్నారు. బెట్టింగ్‌లు కాసి నష్టపోతున్న వారిలో కొంతమంది ఆత్మహత్యలకు పాల్పడుతూ కన్నవారికి సోకాన్ని మిగుల్చుతున్నారన్నారు. ఏ ఒక్కరూ బెట్టింగుల జోలుకు వెళ్లవద్దని హితవు పలికారు. బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని కోరుతూ పలాస–కాశీబుగ్గ జంట పట్టణాలలో బెట్టింగ్ యాప్‌లపై స్వచ్ఛంద సంస్థలతో కలిసి శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ ట్రేడ్ చైర్మన్ వజ్జ బాబూరావు, ఏపీఎన్‌జీవో అధ్యక్షులు బి.గోపాల్, నాయకులు దువ్వాడ శ్రీకాంత్, ఐటీఐ ప్రిన్సిపాల్ పైల జవహార్, వామపక్షపార్టీల నాయకులు చాపర వేణుగోపాలరావు, నెయ్యిల గణపతిరావు, మద్దిల వినోద్, నక్క అనీల్, దిలిప్, రాజా, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం కావాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ రామారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: ఓటు వేసి గెలిపించిన ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేసి వారి సమస్యలను పరిష్కరించడమే ప్రజాప్రతినిధులుగా మనందరి లక్ష్యమని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఎంపీపీ కడియాల పద్మ అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు ప్రభుత్వం నిర్వహిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ.. గృహ నిర్మాణ శాఖలో ఇటీవల నిర్వహించిన పొజిషన్ సర్టిఫికెట్ల జారీకి సంబంధించి క్షేత్రస్థాయిలో కూటమినేతలతో కలిసి అధికారులు పనులు కానిచ్చేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు కనీసం సమాచారం ఇవ్వకపోవడం విచారకరమన్నారు. బెజ్జిపుట్టుగ సర్పంచ్ ఎస్‌పీ నారాయణస్వామి మాట్లాడుతూ.. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 108 వాహనంలో డయాలసిస్ రోగులను ఆస్పత్రులకు తీసుకొని వెళ్లేవారని..అయితే ఈ విధానాన్ని గడచిన ఏడు నెలలుగా ఎందుకు నిలిపివేశారని వైద్యశాఖ సిబ్బందిని ప్రశ్నించారు. అయితే దీనిపై వారు సరైన సమాధానం చెప్పకుండా దాటవేశారు. సమావేశంలో తహసీల్దార్ బి.మురళీమోహనరావు, ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి, వివిధ శాఖల అధికారులు ధనంజయమజ్జి, పోలాకి మాధవీలత, ఏపీఎం గోవింద్, ఏపీవో టి.నారాయణ పాల్గొన్నారు.

రేషన్‌కార్డుదారులకు ఈకేవైసీ తప్పనిసరి

టెక్కలి: రేషన్ కార్డుల్లో ఉన్న కుటుంబ సభ్యులు తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని టెక్కలి ఇన్‌చార్జి తహసీల్దార్ పి.రవికుమార్ స్పష్టం చేశారు. టెక్కలి మండలంలోని రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో రేషన్ కార్డుల్లో ఉన్న లబ్ధిదారులు కొంతమంది ఈకేవైసీ చేసుకున్నారని ఆయా కార్డుల్లో మిగులు సభ్యులు సైతం ఈకేవైసీ చేసుకోవాలని వెల్లడించారు. దీనికి రేషన్ డీలర్లు బాధ్యత వహించాలని ఆదేశించారు. మండలంలో 63,662 మంది యూనిట్లకు గాను 56,608 మంది లబ్ధిదారులకు ఈకేవైసీ పూర్తయిందని.. మిగిలిన 7054 మంది నమోదు చేసుకోవాలన్నారు.

కొర్లాంలో డీజేల నిషేధం

సోంపేట: కొర్లాం పంచాయతీలో డీజేలను నిషేధించాలని స్థానికులు నిర్ణయించారు. డీజే శబ్దంతో ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో గ్రామ సభను నిర్వహించి ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. దీనికి పోలీసులు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేస్తూ బారువ ఎస్సై హరిబాబు నాయుడుకు శనివారం విజ్ఞప్తి పత్రం అందజేశారు. తీర్మానాన్ని వ్యతిరేకించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సైను కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో రాంబుడ్డి గణపతి, రత్నాల శ్రీనివాసరావు ఉన్నారు.

అలరించిన కోలాటం



టెక్కలి మండలం పోలవరం గ్రామంలో జరుగుతున్న పాశిపోలమ్మ సిరిమానోత్సవంలో భాగంగా శనివారం నిర్వహించిన కోలాటం అలరించింది. రణస్థలానికి చెందిన మహిళా కళాకారులు లయబద్ధంగా కోలాటం ఆడి ఆకట్టుకున్నారు. అలాగే మేళ తాళాలతో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. చివరి రోజున జరగనున్న సిరిమాను సంబరం కోసం మాను కర్రను సిద్ధం చేశారు. – టెక్కలి

ఉపాధి పనులు ప్రారంభం



వజ్రపుకొత్తూరు మండలంలో తాడివాడలో ఉపాధి హామీ పథకం పనులు శనివారం ప్రారంభమయ్యాయి. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పనులను ప్రారంభించి మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ పనులు కల్పించాలని అధికారులను సూచించారు. అలాగే వజ్రపుకొత్తూరులో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఎంపీడీవో రమేష్ నాయుడు, ఏపీవో అరుణ్‌కుమార్, టీఏ కేశవ, మాజీ ఎంపీపీ గొరకల వసంతస్వామి, టీడీపీ మండల అధ్యక్షులు సూరాడ మోహన్‌రావు పాల్గొన్నారు. – వజ్రపుకొత్తూరు రూరల్

జీవామృతం తయారీపై అవగాహన



సేంద్రీయ వ్యవసాయ విధానంలో భాగంగా ద్రవ జీవామృతం తయారీ చేసి ఉపయోగించడం ద్వారా పంటలకు మంచి ప్రయోజనం చేకూరుతుందని కంచిలి మండల వ్యవసాయాధికారి బి.ధనుంజయ అన్నారు. బలియాపుట్టుగలో కూరగాయలు సాగుచేసే రైతులకు సామూహికంగా ద్రవ జీవామృతం తయారు చేసే విధానంపై శనివారం ప్రకృతి వ్యవసాయ విధానం మండల యాంకర్ టి. శివానందం అవగాహన కల్పించారు. ఎంఎంఎస్ కోశాధికారి లక్ష్మి, వీఏఏ వనజాక్షి, ఐసీఆర్‌పీలు పుష్పలత, రోహిణి, లీడ్ ఫార్మర్లు పాల్గొన్నారు. – కంచిలి

అందరి భాగస్వామ్యంతో సారా నిర్మూలన



ఇచ్ఛాపురం రూరల్: మాట్లాడుతున్న సీఐ పీడీ ప్రసాద్



కంచిలి: మాట్లాడుతున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

ఇచ్ఛాపురం రూరల్: అధికారులు, ప్రజాప్రతినిధులు, యువజన, స్వచ్ఛంద సేవా సంస్థల భాగస్వామ్యంతో సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దగలమని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.డి.ప్రసాద్ అన్నారు. ఈదుపురం గ్రామ సచివాలయంలో నవోదయం–2.0 కార్యక్రమంపై శనివారం అవగాహన కల్పించారు. సారా రహిత పల్లెలుగా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. దేశానికి యువత అత్యుత్తమమైన సంపదని.. వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అందుకు గ్రామ పంచాయతీ, సచివాలయం, యువజన సంఘం, అటవీ శాఖ, ఎక్సైజ్ శాఖల భాగస్వామ్యం ఉండేందుకు కమిటీలు వేయడం జరుగుతుందన్నారు. గ్రామాలను నాటు సారా రహిత పల్లెలుగా తీర్చిదిద్దేందుకు 'నవోదయం 2.0' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. సర్పంచ్‌లు నర్తు వరప్రసాద్‌రావు, వైస్ ఎంపీపీ దువ్వ వివేకానందరెడ్డి, అటవీశాఖ బీట్ ఆఫీసర్ ఎ.రవికుమార్, కార్యదర్శి కృష్ణ, మహిళా పోలీసులు రాజేశ్వరి, రమ్యలు పాల్గొన్నారు.

సారాను ఐక్యంగా నిర్మూలిద్దాం

కంచిలి: నాటుసారా నిర్మూలనకు ఐక్యంగా కృషిచేద్దామని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోంపేట ఎక్సైజ్ సీఐ కె.బేబీరాణి ఆధ్వర్యంలో నవోదయం–2 కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం నిర్వహించారు. సారా సేవించడం వలన కలిగే నష్టాలను వివరించారు. ఎంపీడీవో వి.తిరుమలరావు, తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్, ఈవోపీఆర్డీ ఈశ్వరి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోండి

- మంత్రి అచ్చెన్నాయుడు



టెక్కలి రూరల్: రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: టెక్కలి నియోజకవర్గంలో మంచినీటి ఎద్దడి లేకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి కె.అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. కోటబొమ్మాళిలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికీ మంచినీరు అందించడమే లక్ష్యమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల పరిధిలోని 497 గ్రామాలకు కుళాయిల ద్వారా ప్రతి ఇంటికీ మంచినీరు అందిస్తామన్నారు. రూ. 97 కోట్లతో పనులు నిర్వహించేందుకు టెండర్లను ఆహ్వానించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. అవసరమైన మేరకు నీటి సరఫరా కోసం ట్యాంకులను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు బాషా, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆస్పత్రి రోడ్డు పరిశీలన

టెక్కలి రూరల్: టెక్కలిలోని జిల్లా ఆస్పత్రికి వంశధార కార్యాలయం పక్కనుంచి రూ.35 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు పనులను మంత్రి అచ్చెన్నాయుడు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మలుపులు లేకుండా రోడ్డును నిర్మించాలని.. అడ్డుగా ఉన్న భవనాలు తొలగించాలన్నారు. అలాగే ఆస్పత్రిలోని శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది మంత్రిని కలిసి తమ సమస్యలను చెప్పుకున్నారు. అనంతరం సీతాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంత్రి పరిశీలించారు. అలాగే పోలవరం గ్రామంలో జరుగుతున్న అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొన్నారు. టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

- ఆర్డీవో కృష్ణమూర్తి



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి, పోర్టు జీఎం శంకర్

సంతబొమ్మాళి: వచ్చే ఖరీఫ్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పోర్టు అధికారులకు టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి సూచించారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు పోర్టు అప్రోచ్ రోడ్డు కోసం నిర్మించిన తాత్కాలిక వంతెనను శనివారం పరిశీలించారు. వర్షాకాలంలో క్రీక్ నుంచి నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుందని తాత్కాలిక వంతెన విస్తీర్ణాన్ని మరింత పెంచాలని రైతులు కోరారు. దీనికి పోర్టు అధికారులు కూడా ఆర్డీవో సమక్షంలో అంగీకరించారు. అనంతరం మూలపేట పోర్టు పరిధిలో రీక్లమేషన్ జోన్‌లోని భూ సమస్యలు, సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించారు. అంతకుముందు మూలపేట ఆర్అండ్ఆర్ కాలనీలోని రోడ్డు, విద్యుత్, నీటి సరఫరా పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఆర్అండ్ఆర్ కాలనీలో ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేంత వరకు తాత్కాలిక కమ్యూనిటీ మరుగుదొడ్లను ఏర్పాటు చేయడానికి అనువైన ప్రదేశాలను గుర్తించారు. మూలపేట పోర్టు జీఎం శంకర్, డిప్యూటీ తహసీల్దార్ హరి, రైతులు కె.మధుసూదనరావు, నక్క భీమారావు, పల్లి జోగారావు, అనంత హన్నూరావు ఉన్నారు.